# కమలంలో కల్లోలం

- ఆది నుంచీ పనిచేసిన వారికి మొండిచేయి
- పారాచూట్ నాయకులకు టికెట్లు
- పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలు
- బీజేపీ శ్రేణుల్లో అయోమయం
- బండి, ఈటల ఉన్న జిల్లాలోనే న్యాయం జరగడం లేదని చర్చ
- కొనసాగుతున్న రాజీనామాల పర్వం
- అంతర్మథనంలో క్షేత్రస్థాయి నాయకత్వం

కరీంనగర్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో అంతంత మాత్రంగానే ఉన్న కమలం పార్టీలో ప్రస్తుతం కల్లోల పరిస్థితి కనిపిస్తున్నది. అధిష్ఠానం ఇటీవల కేటాయించిన టికెట్ల తీరుపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆది నుంచీ పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న నేతలను కాదని కొత్త వారికి టికెట్లు ఇచ్చిన తీరుపై శ్రేణుల్లో అంతర్మథనం మొదలైంది. 'కష్టపడిన వారికే టికెట్లు' అంటూ ఇన్నాళ్లు చెప్పిన నేతలే, ఇప్పుడా విధానాలను తుంగలో తొక్కుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల టికెట్ల కేటాయింపులు మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, అందులో మంథని, వేములవాడ, పెద్దపల్లి, హుస్నాబాద్ మినహా మిగిలిన తొమ్మిది నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ తొలివిడుత జాబితాను తాజాగా విడుదల చేసింది. అందులో ఐదు నియోజకవర్గాలకు కేటాయించిన టికెట్లపై పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది. కోరుట్లకు ధర్మపురి అర్వింద్, జగిత్యాలకు బోగ శ్రావణి, రామగుండానికి కందుల సంధ్యారాణి, సిరిసిల్లకు రాణి రుద్రమదేవి, మానకొండూర్‌కు ఆరెపల్లి మోహన్ టికెట్ల కేటాయింపుల విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలపై పార్టీ శ్రేణులు అంతర్మథనంలో పడినట్లుగా తెలుస్తున్నది. నిజానికి ఈ నియోజకవర్గాల్లో పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న వారు ఉన్నారు. అంతేకాదు, ప్రస్తుత ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్నవారు ఉన్నారు. వాళ్లందరినీ కాదని, పారాచూట్ నాయకులకు టికెట్లు ఇచ్చారన్న విమర్శలు ఆ పార్టీలో బాహాటంగా వినిపిస్తున్నాయి.

### పార్టీనే నమ్ముకొని.. టికెట్లు ఆశించి

జగిత్యాల నియోజకవర్గంలో ఇటీవలే బీజేపీలో చేరిన బోగ శ్రావణికి టికెట్ కేటాయించారు. అయితే ఈ నియోజకవర్గం నుంచి ముదిగంటి రవీందర్ రెడ్డి టికెట్ ఆశించారు. ఆయన మొదటి నుంచి బీజేపీలో ఉన్నారు. రవీందర్ రెడ్డి తండ్రి ముదిగంటి మల్లారెడ్డి ఆర్‌ఎస్‌ఎస్‌లో 60 ఏండ్లకు పైగా పనిచేశారు. పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్‌గా పనిచేశారు. అలాగే డాక్టర్ శైలేందర్ రెడ్డి కూడా టికెట్ ఆశించారు. ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ శైలందర్ రెడ్డి ఇంటికి వెళ్లి మరీ టికెట్ ఇస్తామని చెప్పి బీజేపీలో చేర్చుకున్నట్లుగా ప్రచారం జరిగింది. న్యాయవాది చిలుక మర్రి మదన్మోహన్, పన్నాల తిరుపతిరెడ్డి ఇలా పలువురు కూడా టికెట్ ఆశించారు. పార్టీ కోసం పనిచేస్తున్నారు. ఇప్పుడు బోగ శ్రావణికి టికెట్ ఇవ్వడంతో వీరి ఆశలు గల్లంతయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోరుట్ల నియోజకవర్గాన్ని అర్వింద్‌కు కేటాయించడంతో ఇక్కడి ఆశావహులకు నిరాశే మిగిలింది. నమ్ముకున్న నాయకుడే టికెట్ ఎగరేసుకుపోయారన్న అభిప్రాయాలు ఆ పార్టీలో వ్యక్తమవుతున్నాయి. అర్వింద్ పార్టీ బలోపేతం పేరిట కోరుట్ల నియోజకవర్గంలో చేరికలను ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే మెట్‌పల్లి పట్టణానికి మాజీ సర్పంచ్ సాంబారి ప్రభాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యులు ఆకుల లింగారెడ్డి, డాక్టర్ రఘు, సురభి నవీన్‌కుమార్, న్యాయవాది బద్దం గంగాధర్ తదితరులు బీజేపీలో చేరారు. వీరితో పాటు గత శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన డా. జేఎన్ వెంకట్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు జేఎన్ సునీత దంపతులు ఆ ఎంపీని నమ్ముకొని టికెట్ కోసం గంపెడాశలు పెట్టుకున్నారని పార్టీ చర్చించుకుంటున్నది. ఎవరికి వారే ఎంపీ ప్రాపకం కోసం ప్రయత్నాలు చేస్తే.. తీరా ఆయనే ఎగరేసుకుపోయారన్న ఆందోళన వారిలో కనిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లోనే కొంత మంది నాయకులు కొత్త బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. కొద్ది రోజుల్లోనే కొంత మంది నాయకులు తమ భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించే అవకాశం కనిపిస్తున్నది. సిరిసిల్ల నియోజకవర్గంలో రాణి రుద్రమకు టికెట్ ఇచ్చారు. ఇక్కడ నుంచి న్యాయవాది ఆవునూరి రమకాంత్‌రావు, లగిశెట్టి శ్రీనివాస్‌తో పాటు బీజేపీ పార్లమెంటరీ కో–కన్వీనర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆడెపు రవీందర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి తదితరులు టికెట్ ఆశించారు. అధిష్ఠానం మాత్రం రాణి రుద్రమకు టికెట్ కేటాయించి వీరి ఆశలపై నీళ్లు చల్లింది. మానకొండూర్ నియోజకవర్గంలో గడ్డం నాగరాజు ఆది నుంచీ పార్టీలో పనిచేస్తున్నారు. ఎంతో కాలం నుంచి సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయనతో పాటు మరో ఇద్దరు నేతలు ఇక్కడి నుంచి టికెట్ ఆశించారు. ఇటీవలే బీజేపీలో చేరిన ఆరెపల్లి మోహన్‌కు ఇక్కడ టికెట్ ఇవ్వడంతో ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. రామగుండంలో తాజాగా చేరిన కందుల సంధ్యారాణికి టికెట్ ఇచ్చారు. నిజానికి ఈ ప్రాంతం నుంచి పెద్దపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రావుల రాజేందర్‌తోపాటు మరికొంత మంది టికెట్ ఆశించారు. కానీ పార్టీ తీసుకున్న నిర్ణయంతో ఆశలు అడియాసలే అయ్యాయి.

### అంతర్మథనం

పదమూడు నియోజకవర్గాలకు గాను మంథని, వేములవాడ, పెద్దపల్లి, హుస్నాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఈ నియోజకవర్గాల్లోనూ ఏమీ జరుగుతుందో అన్న ఆందోళన ఆయా నియోజకవర్గాల్లోని శ్రేణుల్లో కనిపిస్తున్నది. ఇక్కడ కూడా ఆది నుంచి పనిచేసిన వారికి ఇస్తారా..? లేక ఇప్పుడు కేటాయించిన మాదిరిగానే పారాచూట్ నాయకులకే ఇస్తారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ రాజేందర్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, పార్టీ కోసం ముందు నుంచి ఎవరో పనిచేస్తున్నారో తెలిసి కూడా పారాచూట్ నాయకులకు టికెట్లు కేటాయిస్తుంటే ఎలా చూస్తూ ఊరుకుంటారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు జరుగుతున్న తతంగాన్ని చూస్తున్న ఆ పార్టీ క్షేత్రస్థాయి నాయకత్వం అంతర్మథనంలో పడిందని పార్టీ వర్గాలే చర్చించుకుంటున్నాయి. పార్టీని నమ్ముకొని పనిచేయడం వల్ల లాభం లేదని, ఎన్నికల సమయంలో వచ్చి అగ్రశ్రేణి నాయకత్వంతో మాట్లాడుకుంటే టికెట్లు వస్తాయన్న చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో చాలా మంది పార్టీని వీడడంతోపాటు తమ భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయించుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలుస్తున్నది. ఇప్పటికే సిరిసిల్ల నియోజకవర్గంలో న్యాయవాది, ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఆవునూరి రమకాంత్‌రావు పార్టీకి రాజీనామా చేశారు. టికెట్ల కేటాయింపులో ఆ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలను ఎండగట్టిన ఆయన పలు ప్రశ్నలు సంధించారు. కానీ, వాటిపై ఇప్పటి వరకు పార్టీ నాయకత్వం సమాధానం చెప్పలేదు. ఈ పరిస్థితుల్లోనే రమకాంత్‌రావు పార్టీని వీడి గులాబీ పార్టీలో చేరారు. ఇదే బాటలో మరికొంత మంది నాయకులు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. నమ్ముకున్నోళ్లకే న్యాయం చేయని అధిష్ఠానం, ప్రజలకు ఏం చేస్తుందని సొంత పార్టీ నుంచే విమర్శలు వస్తున్నాయి.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# టికెట్ వెనుక ఏదో కుట్ర ఉన్నది

- అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న శ్రావణికి ఇవ్వడంపై ఏదో దురుద్దేశమే
- ఇది ఓ నాయకున్ని గెలిపించేందుకే
- త్వరలోనే బహిర్గతం చేస్తా
- విలేకరుల సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

జగిత్యాల టౌన్, అక్టోబరు 25 : జగిత్యాల నియోజకవర్గ బీజేపీ టికెట్ తనకు ఇవ్వకపోవడంలో ఏదో కుట్ర దాగి ఉన్నదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్నెండేళ్లుగా జగిత్యాల నియోజకవర్గంలో అనేక పోరాటాలు చేసి బీజేపీ జెండాను భుజాలపై మోశానని, గత ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి అనేక మంది కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేస్తే నేడు బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉందన్నారు. 1980–90 మధ్యలో ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సిద్ధాంతం పరంగా నక్సలైట్‌లను ఎదురొడ్డి పోరాటం చేశామన్నారు. మున్సిపాలిటీ బోగ శ్రావణి చేసిన అవినీతిపై పోరాటం చేయడంతో రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న శ్రావణిని పార్టీలోకి చేర్చుకున్నా పార్టీ నిర్ణయం మేరకు మిన్నుకుండిపోయామన్నారు. పార్టీ కోసం మా కుటుంబం అనేక త్యాగాలు చేసిందన్నారు. పార్టీలో ఉండే పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ కోసం ఇన్నేళ్లుగా పనిచేసిన కార్యకర్తలను గౌరవించకుండా.. తమను సంప్రదించకుండా పార్టీ టికెట్ బోగ శ్రావణికి కేటాయించారంటే ఇందులో ఏదో దురుద్దేశ్యం ఉందని, దీని వెనుక అనుమానం కలుగుతుందన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో నా పని తీరు చూసి గతంలో నాకు టికెట్ ఇచ్చారని, ఈసారి కూడా టికెట్ వస్తుందని ఆశించానన్నారు. కానీ నాయకులు, కార్యకర్తల మనోభావాలకు భిన్నంగా వేరే పార్టీ నుంచి వచ్చిన శ్రావణికి టికెట్ ఇచ్చారన్నారు. టికెట్ వచ్చి మూడు రోజులైనా శ్రావణి గానీ, వాళ్ల కుటుంబం గానీ కనీసం తనను కలువలేదన్నారు. నాలుగున్నరేళ్లుగా కార్యకర్తలు క్షోభ అనుభవించి, అనుమానాలు ఎదుర్కొన్నా ఏనాడు బయటకు చెప్పలేదన్నారు. మనసులో పెట్టుకొని కుమిలిపోయానన్నారు. నా కోసం అన్నిటికి ఓర్చుకొని మౌనంగా ఉన్న కార్యకర్తలకు సదా రుణపడి ఉంటానన్నారు. ఎళ్లవేళల అండగా ఉంటానన్నారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కార్యకర్తల అభిప్రాయానికి కట్టుబడి ఉండాలన్నారు. కార్యకర్తల మనోభావాలకు వ్యతిరేకంగా పార్టీ నిర్ణయం తప్పని అధిష్టానం గుర్తించాలన్నారు. కష్టపడి నిర్మాణం చేసుకున్న పార్టీని భూస్థాపితం చేసి కుట్ర చేద్దాం అనుకుంటే రవీందర్‌రెడ్డి చేతకాని వ్యక్తి కాదన్నారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకం కాదని, పార్టీ నిర్మాణాన్ని దెబ్బతీస్తే ఎంతకైనా తెగిస్తానన్నారు. గతంలో తన అన్నా పార్టీ కోసం ప్రాణ త్యాగం చేశాడని గుర్తు చేశారు. తాను కూడా ప్రస్తుతం పార్టీని కాపాడుకునేందుకు ఏ త్యాగానికైనా సిద్ధమే అన్నారు. అధిష్టానం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. చర్చించిన తర్వాతే అభ్యర్థికి బీఫాం అందించాలని సూచించారు. ఇక్కడ కేటాయించిన టికెట్ బీజేపీ గెలువడం కోసం కాదని, ఓ నాయకున్ని గెలిపించడం కోసం అని పార్టీ అధిష్టానం గుర్తుంచుకోవాలని ఇసూచించారు. మోసపూరిత కుట్రను త్వరలోనే బహిర్గతం చేస్తానన్నారు.

# నామినేషన్ల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

- రెవెన్యూ సిబ్బందికి ఎన్నికల విధులు

కలెక్టరేట్, అక్టోబర్ 25: త్వరలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టిపెట్టింది. అందుకు రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పజెప్పింది. దీంతో వారి రోజువారీ కార్యకలాపాలకు తాత్కాలికంగా బ్రేక్ పడనున్నది. ఈ నెల 30న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా, నవంబర్ 3 నుంచి 10వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ క్రమంలో రిటర్నింగ్ అధికారులకు తోడు రెవెన్యూ అధికారులు, సిబ్బందే ఎక్కువ మంది ఉండనున్నారు. అలాగే కోడ్ అమల్లోనూ రెవెన్యూ అధికారులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర పనులు మినహా ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ప్రతి ఉద్యోగి నామినేషన్ల పర్వం ముగిసే వరకు 24 గంటల పాటు అందుబాటులో ఉండేందుకు సిద్ధంగా ఉండాలని నిర్దేశించారు. ఎన్నికలు పారదర్శకంగా, పకడ్బంధీగా, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు కూడా సహకరించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం కోరుతున్నది. నామినేషన్ల గడువు ముగిసిన అనంతరం రెవెన్యూ సిబ్బంది తిరిగి, తమ కార్యాలయాల్లో యథావిధిగా కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుంది.